ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -55 పేజీలు - 05 వెల - 04/- శుక్రవారం 27 ఫిబ్రవరి 2026

# నదుల అనుసంధానమే శ్రీరామరక్ష

## శాసనసభలో సాగునీటి రంగంపై జరిగిన చర్చలో చంద్రబాబు


**పోలవరం-నల్లమల అనుసంధానంతో రెండు రాష్ట్రాలకూ లాభమేనన్న సీఎం చంద్రబాబు**

**వచ్చే ఏడాది మే 15 నుంచే నారుమళ్లకు నీరందించేలా ప్రణాళికలు సిద్ధం**

**నీళ్లు రాకుండానే వెలిగొండకు రిబ్బన్ కట్ చేసి గత పాలకులు క్రెడిట్ కొట్టేశారు**

**రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై త్వరలోనే బ్లూప్రింట్ విడుదల చేస్తామని వెల్లడి**

**ప్రతి ఎకరాకు నీరందించి తెలుగు తల్లికి జలహారతి ఇవ్వడమే లక్ష్యమని స్పష్టీకరణ**



అమరావతి,**ఫిబ్రవరి 26ఆంధ్ర ప్రగతి**

పోలవరం-నల్లమల సాగర్ అనుసంధాన ప్రాజెక్టుతో ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని, దీనిపై పొరుగు రాష్ట్రం అభ్యంతరాలు వ్యక్తం చేయాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వృథాగా సముద్రంలోకి పోతున్న గోదావరి వరద జలాలను మాత్రమే ఈ ప్రాజెక్టు ద్వారా తరలిస్తామని ఆయన శాసనసభలో వివరించారు. గోదావరిపై ఎగువ రాష్ట్రం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినప్పుడు తాము ఎన్నడూ అభ్యంతరం చెప్పలేదని గుర్తుచేశారు. ఈ అనుసంధాన ప్రాజెక్టు వల్ల రెండు తెలుగు రాష్ట్రాలకూ మేలు జరుగుతుందని ఆయన అన్నారు. గురువారం నాడు శాసనసభలో సాగునీటి రంగంపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

రాష్ట్రంలో నీటి భద్రతకు కూటమి ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకెళుతోందని చంద్రబాబు తెలిపారు. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా నీటి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, పరిశ్రమలు, పెట్టుబడులకు నీరే కీలకమని అన్నారు. రాష్ట్రంలోని జలాశయాల్లో ప్రస్తుతం 793 టీఎంసీల నీరు నిల్వ ఉందని,

మిగతా 2లో.

# ఆదాయం న్యాయబద్ధంగా పంచుకోవాల్సిందే!



**సోషల్ మీడియాకు కేంద్రం కీలక ఆదేశం..**

**కంటెంట్ క్రియేటర్లతో ఆదాయం న్యాయబద్ధంగా పంచుకోవాలని సోషల్ మీడియాకు కేంద్ర మంత్రి సూచన**

**జర్నలిస్టులు, మీడియా సంస్థలతో పాటు అందరికీ న్యాయమైన వాటా దక్కాలన్న అశ్విని వైష్ణవ్**

**డిజిటల్ కంటెంట్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని వెల్లడి**

**డీప్‌ఫేక్‌లు, ఏఐ కంటెంట్‌పై ఇప్పటికే నిబంధనలు కఠినతరం చేస్తున్న కేంద్రం**

2లో.

# ఇజ్రాయెల్-భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం



**యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఎవోయూ**

**ఏఐ, వ్యవసాయం తదితర రంగాల్లో ఒప్పందాలు**

**ఇజ్రాయిల్ పర్యటనలో ప్రధాని మోడీ ప్రకటన**

**త్వరలోనే ఇండియా వస్తానన్న నెతన్యాహు**

న్యూఢిల్లీ,,**ఫిబ్రవరి 26ఆంధ్ర ప్రగతి**

ఇజ్రాయెల్-భారత్ మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరనుందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. అలాగే ఇజ్రాయెల్‌లో కూడా త్వరలో యూపీఐ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. యూపీఐ పేమెంట్స్‌తో పాటు ఏఐ,

మిగతా 2లో.

# తెలుగు తప్పనిసరి



**తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం..**

**తెలుగు భాషకు పట్టం కట్టే దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు**

**1 నుంచి 10వ తరగతి వరకు తెలుగు కచ్చితంగా బోధించాలని ఆదేశాలు**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**

రాష్ట్రంలోని విద్యావ్యవస్థలో మాతృభాష తెలుగుకు పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. భవిష్యత్ తరాలకు తెలుగు భాషా సౌరభాన్ని

మిగతా 2లో.

# లొంగిపోయిన ముప్పిడి అవినాశ్

**ఏపీ మద్యం కుంభకోణం కేసులో నిందితుడు అవినాశ్ రెడ్డి సిట్ ముందు లొంగుబాటు**

**వైసీపీ హయాంలో జరిగిన రూ.3,500 కోట్ల స్కాంలో ఈయన ఏ7 నిందితుడు**

**ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ నేతృత్వంలో కొనసాగుతున్న సిట్ దర్యాప్తు**



అమరావతి,**ఫిబ్రవరి 26ఆంధ్ర ప్రగతి**

ఏపీ మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏడో నిందితుడిగా ఉన్న ముప్పిడి అవినాశ్ రెడ్డి ఇవాళ విజయవాడలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఎదుట లొంగిపోయారు. ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించి, ఈ నెల 26లోగా లొంగిపోవాలని ఆదేశించిన రెండు రోజులకే ఆయన సిట్ విచారణకు హాజరయ్యారు.

మిగతా 2లో.

# భారతీయ విద్యాభవన్ తరహాలో స్కూళ్లు

**మౌళిక వసతులతో పాటు..బ్రేక్‌ఫాస్ట్**

**విజయ డెయిరీ ద్వారా అవసరమైన పాల సరఫరా**

**రవాణా కోసం ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం**

**ప్రైవేట్ స్కూళ్ల ఫీజులకు కళ్లెం వేసేలా చర్యలు**

**విద్యారంగంపై సమీక్షలో సిఎం రేవంత్ కీలక ఆదేశాలు**



హైదరాబాద్,,**ఫిబ్రవరి 26ఆంధ్ర ప్రగతి**

కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక సదుపాయాల కల్పనపైన దృష్టి సారించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. భారతీయ విద్యా భవన్,

మిగతా 2లో.

# రాయలసీమ ఎత్తిపోతల పై మండలిలో వాగ్వాదం

## జగన్ చేతకానితనం వల్లే సీమ లిఫ్ట్ ఆగింది : మంత్రుల ధ్వజం

**సీమకు ఐదేళ్లలో జగన్ చేసిందేమీ లేదని, ఆయనో రాయలసీమ ద్రోహి అని విమర్శ**

**శాసనమండలిలో సోము వీర్రాజుపైకి దూసుకెళ్లిన వైసీపీ సభ్యులు... సభ వాయిదా**

అమరావతి**ఫిబ్రవరి 26ఆంధ్ర ప్రగతి**

శాసనమండలిలో రాయలసీమ ఎత్తిపోతల పథకం (రాయలసీమ లిఫ్ట్) అంశంపై అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే నిలిచిపోయిన ఈ ప్రాజెక్టుపై ఇప్పుడు తమను ప్రశ్నించడం ఏంటని కూటమి ప్రభుత్వ మంత్రులు వైసీపీ సభ్యులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నాలుగేళ్ల పాటు ఆగిపోయిన పనులకు



మిగతా 2లో.




# తెలంగాణలో 45 మంది ఐఏఎస్ ల బదిలీ

**రాహుల్ బొజ్జాకు సాధారణ పరిపాలన శాఖ బాధ్యతలు**

**పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్ కుమార్**

**యాదాద్రి భువనగిరి జిల్లా కొత్త కలెక్టర్‌గా అనురాగ్ జయంతి**

హైదరాబాద్,ఫిబ్రవరి 26ఆంధ్ర ప్రగతి

తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. పరిపాలనను మరింత వేగవంతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం 45 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ బదిలీలలో భాగంగా అత్యంత కీలకమైన సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) బాధ్యతలను రాహుల్ బొజ్జాకు అప్పగించారు.

మిగతా 2లో.

# న్యాయవ్యవస్థపై ఎన్‌సీఈఆర్‌టీ 'కుట్ర'..

**సుప్రీంకోర్టు సంచలన తీర్పు!**

**వివాదాస్పద పాఠ్యపుస్తకంపై తక్షణ నిషేధం**


**బేషరతుగా క్షమాపణలు చెప్పిన కేంద్రం**

**అవినీతి పాఠ్యాంశంపై కఠిన చర్యలు..**

**మార్చి 11న తదుపరి విచారణకు ఆదేశం**

న్యూఢిల్లీ,**ఫిబ్రవరి 26ఆంధ్ర ప్రగతి**

న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను మంటగలిపేలా పాఠ్యపుస్తకాల్లో అభ్యంతరకర అంశాలను ప్రచురించిన ఎన్‌సీఈఆర్‌టీకి సుప్రీంకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. ఎనిమిదో తరగతి సామాజిక శాస్త్ర పుస్తకంలో న్యాయవ్యవస్థలోని అవినీతిపై చేర్చిన అధ్యాయాన్ని తీవ్రంగా పరిగణించిన అత్యున్నత న్యాయస్థానం.. ఆ పుస్తకంపై తక్షణ నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ



మిగతా 2లో.

# లొంగిపోయిన ముప్పిడి అవినాశ్

**మొదటిపేజీ తరువాయి**

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, అవినాశ్ రెడ్డి కచ్చితంగా లొంగిపోయి దర్యాప్తునకు సహకరించాలని స్పష్టం చేసింది. అరెస్టు నుంచి రక్షణ కల్పించాలన్న ఆయన అభ్యర్థనను తిరస్కరించింది. అయితే, ట్రయల్ కోర్టులో రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు స్వేచ్ఛనిచ్చింది. అంతకుముందు ఏపీ హైకోర్టు ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయడంతో అవినాశ్ రెడ్డి సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో (2019-24) ఎక్సైజ్ పాలసీని మార్చి, డిస్టిలరీల నుంచి ముడుపులు స్వీకరించడం ద్వారా సుమారు రూ.3,500 కోట్ల కుంభకోణం జరిగిందని ప్రధాన ఆరోపణ. మద్యం సరఫరాదారుల నుంచి కమీషన్ల రూపంలో వసూలు చేసిన డబ్బును అవినాశ్ రెడ్డి విదేశాలకు తరలించి మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని అభియోగాలు నమోదయ్యాయి. ఆయన దేశం విడిచి పారిపోయాడని, ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి ఇందుకు సహకరించాడని ప్రాసిక్యూషన్ గతంలో కోర్టుకు తెలిపింది.2024లో టీడీపీ-ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కుంభకోణంపై కేసు నమోదైంది. తొలుత ఎక్సైజ్ శాఖ అధికారి ఫిర్యాదుతో సీఐడీ దర్యాప్తు ప్రారంభించగా, తర్వాత ప్రభుత్వం కేసును లోతుగా విచారించేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కేసులో ఐపీసీ, అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద మంగళగిరి సీఐడీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.వైసీపీ నేతలు తమకు అనుకూలమైన నూతన మద్యం పాలసీని ప్రోత్సహించి, కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టి, డిస్టిలరీ కంపెనీల నుంచి ముడుపులు స్వీకరించారని, తద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం కలిగించారని సిట్ దర్యాప్తులో తేలినట్లు సమాచారం. ఈ కేసులో పలువురు ఎంపీలు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, డిస్టిలరీ కంపెనీల యజమానులను కూడా సిట్ నిందితులుగా చేర్చింది. అవినాశ్ రెడ్డి లొంగుబాటుతో ఈ కేసు దర్యాప్తు మరింత వేగవంతం అయ్యే అవకాశం ఉంది.

# తెలంగాణలో 45 మంది ఐఏఎస్ ల బదిలీ

**మొదటిపేజీ తరువాయి**

ఆయన జీఏడీ ముఖ్యకార్యదర్శిగా వ్యవహరిస్తూనే, బీసీ సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలను కూడా చూసుకోనున్నారు.సీనియర్ అధికారుల బాధ్యతల్లోనూ ప్రభుత్వం పలు మార్పులు చేసింది. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్ కుమార్‌ను, రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌ను నియమించింది. ఆర్థిక మరియు ప్రణాళికా విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్ బాధ్యతలు చేపట్టనుండగా, దేవాలయాల పర్యవేక్షణ బాధ్యతను ఎం. హనుమంతరావుకు (దేవదాయ శాఖ కమిషనర్) అప్పగించారు.ప్రజల సమస్యల పరిష్కార వేదిక 'ప్రజావాణి' రాష్ట్ర నోడల్ అధికారిగా డి. దివ్యను నియమించడం గమనార్హం. కేవలం సచివాలయ స్థాయిలోనే కాకుండా జిల్లాల పాలనలోనూ ప్రభుత్వం ప్రక్షాళన చేపట్టింది. పలు జిల్లాల కలెక్టర్లను మారుస్తూ తీసుకున్న నిర్ణయంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా కొత్త కలెక్టర్‌గా అనురాగ్ జయంతి నియమితులయ్యారు. ఈ భారీ బదిలీల ద్వారా పాలనలో కొత్త ఉత్తేజం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

# తెలుగు తప్పనిసరి

**మొదటిపేజీ తరువాయి**

అందించడమే లక్ష్యంగా, వచ్చే 2026-27 విద్యా సంవత్సరం నుండి రాష్ట్రంలోని అన్ని రకాల పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగును కచ్చితంగా ఒక సబ్జెక్టుగా బోధించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేవలం స్టేట్ బోర్డు పాఠశాలలకే పరిమితం కాకుండా, సీబీఎస్ఈ (జదీూజు), ఐసీఎస్ఈ (×జూజు), ఐబీ (×దీ) వంటి అంతర్జాతీయ ప్రమాణాలతో నడిచే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లోనూ మాతృభాషను కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.
ప్రస్తుతం అనేక కార్పొరేట్ పాఠశాలల్లో మార్కుల వేటలో పడి తెలుగును విస్మరిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. కేవలం స్కోరింగ్ కోసమే అరబిక్, సంస్కృతం వంటి భాషలకు ప్రాధాన్యతనిస్తూ, తెలుగును అటకెక్కిస్తున్న తీరుపై ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు కనీసం తెలుగులో చిన్న వాక్యాన్ని కూడా సరిగ్గా చదవలేకపోవడం భాషా సంక్షోభానికి దారితీస్తోందని గుర్తించిన సర్కారు, తెలుగు తప్పనిసరి అమలు చట్టం-2018ని కఠినంగా అమలు చేసేందుకు సిద్ధమైంది. గతంలో కోవిడ్ కారణంగా 9, 10 తరగతులకు ఇచ్చిన మినహాయింపులను రద్దు చేస్తూ, 2025-26లో 9వ తరగతికి, 2026-27 నాటికి 10వ తరగతికి ఈ నిబంధనను వర్తింపజేయనుంది.
అయితే, విద్యార్థులపై పనిభారం పడకుండా ప్రభుత్వం ఒక వినూత్న మార్పును ప్రవేశపెట్టింది. ఇతర బోర్డుల విద్యార్థుల కోసం కఠినమైన 'సింగిడి' పుస్తకాలకు బదులుగా, అత్యంత సరళంగా ఉండే 'వెన్నెల' పాఠ్యపుస్తకాలను రూపొందించింది. కేవలం ఇతర రాష్ట్రాల నుండి వచ్చి 8వ తరగతి ఆపై తరగతుల్లో చేరే విద్యార్థులకు మాత్రమే ఈ నిబంధన నుండి మినహాయింపు ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలలపై భారీ జరిమానాలు విధిస్తామని, చట్టపరమైన చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. ప్రతి పాఠశాల తగినంత మంది తెలుగు ఉపాధ్యాయులను నియమించుకోవాలని, ఎస్‌సీఈఆర్‌టీ (రాజజు=ు) నిర్దేశించిన పుస్తకాలనే బోధించాలని స్పష్టం చేయడంతో, రాష్ట్రవ్యాప్తంగా తెలుగు భాషకు కొత్త ఊపిరి పోసినట్లయింది.

# నదుల అనుసంధానమే శ్రీరామరక్ష

**మొదటిపేజీ తరువాయి**

అందుకే ఈసారి పంటల సీజన్‌ను ముందుకు జరిపి, వచ్చే ఏడాది మే 15 నుంచే నారుమళ్లకు నీరందించేలా ప్రణాళిక రచించామని ప్రకటించారు. ఈ విషయంపై రైతులను చైతన్యవంతం చేయాలని ప్రజాప్రతినిధులకు ఆయన సూచించారు. ప్రతి ఎకరాకు నీరందించి తెలుగు తల్లికి జలహారతి ఇవ్వడమే తన లక్ష్యమని, దీనికోసం రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై త్వరలోనే ఒక బ్లూప్రింట్ విడుదల చేస్తామని వెల్లడించారు.

**ప్రాజెక్టులన్నీ మా హయాంలో కట్టినవే**

రాష్ట్రంలో నిర్మించిన ప్రాజెక్టులన్నీ తమ హయాంలోనివేనని చంద్రబాబు స్పష్టం చేశారు. 2014-19 మధ్య సాగునీటి రంగానికి రూ.68 వేల కోట్లు ఖర్చు చేశామని గుర్తుచేశారు. ఎన్టీఆర్ హయాంలోనే రాయలసీమకు తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీనీవా వంటి ప్రాజెక్టులు వచ్చాయని, తాము పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీళ్లిచ్చి, శ్రీశైలంలో 100 టీఎంసీలు రాయలసీమకు తరలించామని వివరించారు. అందుకే ఆ ప్రాంతం నేడు రతనాల సీమగా మారుతోందన్నారు.

**వెలిగొండపై గత పాలకుల క్రెడిట్ చోరీ**

గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వెలిగొండ ప్రాజెక్టుకు నీళ్లు రాకుండానే రిబ్బన్ కట్ చేసి క్రెడిట్ కొట్టేసే ప్రయత్నం చేశారని ఎద్దేవా చేశారు. 30 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసిన ఆ ప్రాజెక్టు మొదటి దశను ఈ ఏడాది జూలైలోనే పూర్తి చేసి నీళ్లిస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పూర్తికి మరో రూ.2500 కోట్లు అవసరమని, ఇప్పటికే ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు రూ.456 కోట్లతో శంకుస్థాపన చేశామని తెలిపారు. అదేవిధంగా కుప్పం కాలువలో ట్యాంకర్లతో నీళ్లు పోసి ప్రచారం చేసుకున్నారని విమర్శించారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసి డయాఫ్రాం వాల్‌ను గోదావరిలో కలిపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాజెక్టును మళ్లీ పరుగులు పెట్టించి పుష్కరాల కంటే ముందే పూర్తి చేస్తామన్నారు.

**ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు**

ప్రస్తుతం రాష్ట్రంలోని జలాశయాలు 793 టీఎంసీల నీటితో కళకళలాడుతున్నాయని సీఎం తెలిపారు. జల సంరక్షణ చర్యల వల్ల రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలు సగటున 6 మీటర్లు పెరిగాయని, దీనివల్ల రూ.91 కోట్ల విద్యుత్ ఆదా అయిందని వివరించారు. తాను చేయని తప్పుకు 53 రోజులు జైల్లో పెట్టారని, అయినా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీరివ్వాలన్న సంకల్పంతో పనిచేస్తున్నానని అన్నారు. నీటి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, కొందరు కేవలం రాజకీయం కోసమే నీటి సమస్యలను సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రతి ఇంటికీ తాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీరు, పరిశ్రమలకు నీరు అందించడమే లక్ష్యంగా ముందుకెళతామని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# ముందస్తు చర్యలే ముఖ్యం: సీఎం చంద్రబాబు

"ఘటన జరిగాక స్పందించడం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదు. ముందస్తు పర్యవేక్షణ, అప్రమత్తత ద్వారా ఈ తరహా ఘటనలు జరగకుండా చూడాలి. శ్రీకాకుళంలో తాగునీరు కలుషితమైన ఘటనలో ముందస్తు తనిఖీలు జరిగి ఉంటే ఈ సమస్య వచ్చేదే కాదు" అని అభిప్రాయపడ్డారు. జిల్లా కలెక్టర్లు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టడం ద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు.

# ఆదాయం న్యాయబద్ధంగా పంచుకోవాల్సిందే!

**సోషల్ మీడియాకు కేంద్రం కీలక ఆదేశం..**

న్యూఢిల్లీ,,ఫిబ్రవరి 26ఆంధ్ర ప్రగతి

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు తమ ఆదాయాన్ని కంటెంట్ సృష్టించేవారితో న్యాయబద్ధంగా పంచుకోవాలని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. జర్నలిస్టులు, సంప్రదాయ మీడియా సంస్థలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, విద్యావేత్తలు, పరిశోధకులు ఇలా ఎవరైనా సరే, కంటెంట్ సృష్టిస్తే వారికి ఆదాయంలో సరైన వాటా దక్కాల్సిందేనని ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్లాట్‌ఫామ్‌లు ఇతరులు అప్‌లోడ్ చేసే కంటెంట్ ద్వారా గణనీయంగా ప్రయోజనం పొందుతున్నాయని, అందుకే కంటెంట్ సృష్టికర్తలకు కూడా వారి సరైన వాటా దక్కాలని ఆయన పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాల్లోని కంటెంట్ క్రియేటర్ల నుంచి మొదలుకొని, తమ పరిశోధనలను పంచుకునే ప్రొఫెసర్ల వరకు అందరికీ ఈ న్యాయం జరగాలన్నారు. ఆదాయ పంపిణీలో న్యాయబద్ధతను తీసుకురావడం ద్వారా దేశంలో డిజిటల్ కంటెంట్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల జవాబుదారీతనం, పారదర్శకతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేస్తున్న తరుణంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఇదిలా ఉండగా.. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (మీటీ) గతవారం ఐటీ రూల్స్-2021కి కీలక సవరణలు ప్రతిపాదించింది. పెరిగిపోతున్న డీప్‌ఫేక్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా సృష్టించిన తప్పుడు సమాచారాన్ని అరికట్టడమే ఈ సవరణల లక్ష్యం. ఈ ముసాయిదా నిబంధనల ప్రకారం ఫేస్‌బుక్, యూట్యూబ్, స్నాప్‌చాట్ వంటి పెద్ద సోషల్ మీడియా సంస్థలు (50 లక్షలకు పైగా వినియోగదారులు ఉన్నవి) ఏఐ ఆధారిత కంటెంట్‌ను స్పష్టంగా లేబుల్ చేయాలి.వీడియోలు లేదా చిత్రాలైతే కనీసం 10 శాతం డిస్‌ప్లేను, ఆడియో అయితే మొదటి 10 శాతం వ్యవధిని ఈ లేబుల్ కవర్ చేయాలి. ఈ కంటెంట్‌కు శాశ్వత మెటాడేటా లేదా ఐడెంటిఫైయర్ జోడించాలని, దానిని మార్చడానికి లేదా తొలగించడానికి వీల్లేదని నిబంధనల్లో స్పష్టం చేస్తున్నాయి. ఒకవేళ ఏదైనా ప్లాట్‌ఫామ్ ఉద్దేశపూర్వకంగా లేబుల్ లేని ఏఐ కంటెంట్‌ను అనుమతిస్తే, అది ఐటీ చట్టం ప్రకారం 'తగిన శ్రద్ధ' (ఐఐవ ఎజ్రిఇజ్రవఐఇఐ) పాటించడంలో విఫలమైనట్లు పరిగణించబడుతుంది.

# రాయలసీమ ఎత్తిపోతల పై మండలి లో వాగ్వాదం

ం సమాధానం చెప్పకుండా, ఇప్పుడు ప్రభుత్వంపై బురద చల్లడమేంటని నిలదీశారు. ఈ సందర్భంగా మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వైసీపీ తీరును తీవ్రంగా ఎండగట్టారు. "రాయలసీమ లిఫ్ట్ పనులు 2020లోనే జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాలతో ఆగిపోయాయి. ఈ విషయాన్ని నాటి తెలంగాణ మంత్రి హరీశ్ రావు స్వయంగా ప్రకటించారు. అలాంటప్పుడు, నాలుగేళ్లుగా అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం ఏం చేసింది? కనీసం కౌంటర్ కూడా దాఖలు చేయకుండా నిర్లక్ష్యం వహించింది మీ అసమర్థత కాదా?" అని పయ్యావుల కేశవ్ ప్రశ్నించారు. ఐదేళ్ల పాలనలో రాయలసీమ ప్రాజెక్టులను నిర్వీర్యం చేసి, ప్రాజెక్టులు కొట్టుకుపోవడానికి కారణమైన జగన్ రెడ్డి ఓ రాయలసీమ ద్రోహి అని వారు అభివర్ణించారు.తమ ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధికి కట్టుబడి ఉందని మంత్రులు స్పష్టం చేశారు. "రూ.12 లక్షల కోట్ల బడ్జెట్‌లో వైసీపీ ప్రభుత్వం సీమకు 1 శాతం నిధులు కూడా ఖర్చు చేయలేదు. కానీ, మేం హంద్రీనీవా పనులు పూర్తి చేసి 190 రోజుల్లోనే 44 టీఎంసీల నీటిని తరలించాం. ప్రస్తుతం రాయలసీమ ప్రాజెక్టుల్లో 366 టీఎంసీల నీటిని నిల్వ చేశాం. ఇది మా నాయకుడు చంద్రబాబు సమర్థతకు నిదర్శనం" అని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం 20 నెలల్లోనే రూ.8 వేల కోట్లు ఖర్చు చేసిందని, తాజా బడ్జెట్‌లో మరో రూ.10,014 కోట్లు కేటాయించిందని వివరించారు.వైసీపీ ప్రభుత్వం జీఓ 365 తెచ్చి 102 సాగునీటి ప్రాజెక్టులను రద్దు చేసిందని, గోరుకల్లు, గాలేరు-నగరి వంటి ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించిందని మంత్రులు ఆరోపించారు. "మీ దరిద్రపు పాలనలో, మీ అసమర్థ నాయకుడి చేతకానితనం వల్లే రాయలసీమ లిఫ్ట్ ఆగిపోయింది. ఆ నిజాన్ని కప్పిపుచ్చి ఇప్పుడు డ్రామాలు ఆడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు ఒక యజ్ఞంలా పనిచేస్తుంటే, వైసీపీ నేతలు రాక్షసుల్లా అడ్డుపడుతున్నారు" అని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ హయాంలో నిలిచిపోయిన పనులకు మమ్మల్ని బాధ్యులను చేసే ప్రయత్నాన్ని మానుకోవాలని వారు హితవు పలికారు.

**వీర్రాజుపై దాడికి యత్నించిన వైసీపీ సభ్యులు**

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి రణరంగాన్ని తలపించింది. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య చెలరేగిన వివాదం చివరకు తోపులాట వరకు వెళ్లడంతో సభలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం ముగిసిన తర్వాత, ఈ అంశంపై మరింత చర్చ జరపాలని వైసీపీ సభ్యులు పట్టుబట్టడంతో గందరగోళం మొదలైంది. అయితే, మంత్రి వివరణ పూర్తయిందని స్పష్టం చేసిన మండలి ఛైర్మన్ మోషేనురాజు... తదుపరి ప్రశ్నకు అవకాశం కల్పించారు. ఈ తరుణంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము



వీర్రాజు మాట్లాడేందుకు ప్రయత్నించగా... వైసీపీ సభ్యులు అడ్డుకున్నారు.తమ నిరసన కొనసాగుతుండగానే సోము వీర్రాజుకు మైక్ ఎలా ఇస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన వైసీపీ ఎమ్మెల్సీ ఇజ్రాయెల్ తదితరులు ఒక్కసారిగా వీర్రాజు సీటు వైపు దూసుకెళ్లారు. కేవలం వాగ్వాదానికే పరిమితం కాకుండా, ఆయనపై దాడికి యత్నించడంతో సభలో కలకలం రేగింది. పరిస్థితి విషమిస్తుండటంతో అప్రమత్తమైన మంత్రులు అనిత, గొట్టిపాటి రవికుమార్ వెంటనే సోము వీర్రాజుకు అండగా నిలబడి, వైసీపీ సభ్యులను అడ్డుకున్నారు. ఇరుపక్షాల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వివాదం జరగడం, సభ్యులు ఒకరిపై ఒకరు దూసుకురావడంతో సభ నియంత్రణ తప్పింది. ఈ క్రమంలో పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో ఛైర్మన్ మోషేనురాజు సభను "వాయిదా" వేశారు.

# న్యాయవ్యవస్థపై ఎన్‌సీఈఆర్‌టీ 'కుట్ర'..

**మొదటిపేజీ తరువాయి**

ఇది కేవలం పొరపాటు కాదు న్యాయవ్యవస్థను కించపరిచేలా చేసిన ఉద్దేశపూర్వక కుట్ర అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**బుల్లెట్ తగిలి రక్తం చిందిస్తోంది: సీజేఐ**

విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అత్యంత ఘాటైన పదజాలంతో విరుచుకుపడ్డారు. "ఎన్‌సీఈఆర్‌టీ ప్రయోగించిన బుల్లెట్ తో న్యాయవ్యవస్థ రక్తం చిందిస్తోంది. కోర్టుల విశిష్ట చరిత్రను వివరించాల్సింది పోయి వ్యవస్థను అపకీర్తిపాలు చేసేలా పాఠాలు రాయడం సరికాదు" అని మండిపడ్డారు. యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పట్ల అగౌరవం కలిగించేలా ఈ పాఠ్యాంశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యులెవరో తేలేవరకు ఈ విషయాన్ని వదిలిపెట్టబోమని, జవాబుదారీతనం ఉండాల్సిందేనని స్పష్టం చేశారు.

**కేంద్రం బేషరతు క్షమాపణ**

కోర్టు ఆగ్రహాన్ని గమనించిన కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బేషరతుగా క్షమాపణలు కోరారు. ఈ పాఠ్యాంశాన్ని ప్రభుత్వం ఏమాత్రం సమర్థించడం లేదని, పబ్లిక్ నోటీసు ద్వారా క్షమాపణలు చెబుతామని వెల్లడించారు. ఇప్పటికే వివాదాస్పద పుస్తకాల పంపిణీని నిలిపివేసి, వెబ్‌సైట్ నుంచి కూడా ఆ పాఠాలను తొలగించామని కోర్టుకు వివరించారు.

**కఠిన చర్యలకు ఆదేశం**

ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్, స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీకి కోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. కాగా, సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీలు ఈ వివాదాన్ని కోర్టు దృష్టికి తీసుకురావడంతో సుప్రీంకోర్టు దీనిని సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. ఈ కేసులో తదుపరి పరిణామాలు మార్చి 11న జరిగే విచారణలో వెల్లడికానున్నాయి.

# ఇజ్రాయెల్-భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

**మొదటిపేజీ తరువాయి**

వ్యవసాయం తదితర రంగాల్లో ఒప్పందాలు కుదిరాయి. రెండు దేశాల మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరగనున్నట్లు ఇరు దేశాల ప్రధానులు సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. మొత్తం 27 రంగాల్లో పరస్పర సహకారానికి ఇరు దేశాలు అంగీకరించాయి. మరోవైపు గాజాపై ప్రధాని మోదీ మరోసారి భారత్ వైఖరిని స్పష్టం చేశారు. మానవత్వం ఎప్పుడూ సంఘర్షణలకు బలికాకూడదని అన్నారు. ప్రస్తుత శాంతి ప్రణాళిక ద్వారా ఓ ముందడుగు పడిందని, ఈ ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతుగా నిలుస్తుందని మోదీ హామీ ఇచ్చారు. ఇుగా, త్వరలోనే భారత పర్యటనకు రావాల్సిందిగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ఆహ్వానించారు. అంతకు ముందు ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని నెతన్యాహు ప్రశంసించారు. ఆయన ప్రసంగం ప్రతి ఒక్కరినీ కదిలించిందని అన్నారు. భారత్‌కు రుణపడి ఉన్నామని అన్నారు. మోదీ తమకు స్నేహితుడు కంటే ఎక్కువని అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటన రెండు దేశాల మధ్య సరికొత్త మైత్రికి నాంది పలికింది. విమానాశ్రయం నుంచి ఇజ్రాయెల్ పార్లమెంట్ వరకు మోదీకి లభించిన ఘన స్వాగతం ఈ పర్యటన ప్రాముఖ్యతను చాటిచెప్పింది. పర్యటనలో భాగంగా నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తన వ్యక్తిగత విషయాన్ని ఒకటి పంచుకొని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు మాట్లాడుతూ.. తన భార్యతో తన మొదటి డేట్ ఒక భారతీయ రెస్టారెంట్‌లో జరిగిందని, ఆ భోజనం అద్భుతంగా ఉండటం వల్లే వారి బంధం బలపడిందని సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి తాను, తన పిల్లలు కూడా భారత్‌కు రుణపడి ఉంటామని ఆయన అనగానే ప్రధాని మోదీ నవ్వు ఆపుకోలేక పోయారు. భారతదేశంలోని అపారమైన ప్రతిభను, ఇజ్రాయెల్‌లోని సాంకేతిక పరిజ్ఞానాన్ని కలపడం ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చని ఇద్దరు నేతలు ఆకాంక్షించారు. ప్రధానంగా కచ్చితమైన వ్యవసాయం, సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఆవిష్కరణలు, సాంకేతికత, అభివృద్ధికి సంబంధించి రెండు దేశాల మధ్య 16 కీలక అవగాహన ఒప్పందాలు జరిగాయి.

రెండు దేశాల మధ్య స్నేహాన్ని మరింత బలోపేతం చేసేందుకు త్వరలోనే భారత్‌లో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నేతలు నిర్ణయించారు. 'మా వ్యక్తిగత స్నేహం, ప్రభుత్వాల మధ్య సహకారం, ప్రజల మధ్య అనుబంధం నానాటికీ బలపడుతోంది' అని నెతన్యాహు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. దీనిని కొనసాగించేందుకు సాధ్యమైనంత త్వరగా భారతదేశంలో ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పర్యటన కేవలం దౌత్యపరమైన ఒప్పందాలకు మాత్రమే పరిమితం కాకుండా, ఇద్దరు దేశాధినేతల మధ్య ఉన్న బలమైన వ్యక్తిగత స్నేహాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది.

# భారతీయ విద్యాభవన్ తరహాలో స్కూళ్లు

**మొదటిపేజీ తరువాయి**


జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూళ్లలో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉండాలని సూచించారు. గురువారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి , విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా , కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్, అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని మార్గనిర్దేశం చేశారు. బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌లో తప్పనిసరిగా పాలు అందజేయాలని నిర్దేశించారు. ఇందుకోసం విజయ డైరీ నుంచి పాలు సేకరించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత కోసం ఏఐ టెక్నాలజీని వినియోగించాలని దిశానిర్దేశం చేశారు. కోర్ అర్బన్ రీజియన్ మినహా మిగిలిన నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కోక మండలంలో ఆరుట్ల స్కూల్ తరహాలో ట్రాన్స్‌పోర్ట్‌తో సహా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ట్రాన్స్‌పోర్ట్ కోసం ఎలక్ట్రికల్ బస్సుల ఏర్పాటు పైన అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రైవేట్ స్కూళ్లలో నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దుతో పాటు రికవరీ చేసేలా నిబంధన విధించాలని హుకుం జారీ చేశారు. ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణకు సంబంధించి రికమండేషన్స్‌ని ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం 27 ఫిబ్రవరి 2026

# నంద్యాల బీజేపీ యువమోర్చా కమిటీ ఏర్పాటు.

## నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు





**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 26:** నంద్యాల జిల్లా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలోని యువమోర్చా జిల్లా కమిటీని జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు గురువారం నాడు అధికారికంగా ప్రకటించారు. యువతను పార్టీ సిద్ధాంతాల దిశగా సమీకరించి, జిల్లాలో పార్టీ బలోపేతానికి యువమోర్చా కీలక పాత్ర పోషించాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా యువమోర్చా అధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ.. పార్టీ ఆశయాలు మరియు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజాహిత కార్యక్రమాలను యువతలో విస్తృతంగా తీసుకెళ్లేందుకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు యువతను చైతన్యపరచడం, సేవా కార్యక్రమాలు, సామాజిక బాధ్యతా కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపట్టడం యువమోర్చా ప్రధాన లక్ష్యమని చెప్పారు.

జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు మాట్లాడుతూ.. నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి పార్టీని ప్రతి మండలం, ప్రతి గ్రామంలో బలోపేతం చేయాలని సూచించారు. యువతే దేశ భవిష్యత్తు అని, యువమోర్చా కార్యకర్తలు ప్రజల్లో నమ్మకం పెంపొందించే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

జిల్లా రాజకీయాల్లో యువశక్తి కీలకంగా మారుతోందని, పార్టీ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయడంలో యువమోర్చా ముందుండాలని నాయకులు స్పష్టం చేశారు. కొత్త కమిటీతో జిల్లాలో పార్టీ కార్యక్రమాలు మరింత ఉత్సాహంగా కొనసాగనున్నాయని తెలిపారు.

# న్యూక్లియర్ బాలుర వసతి గృహంలో "డ్రగ్స్ వద్దు బ్రో" కార్యక్రమం ఏర్పాటు.

## ఇన్స్పెక్టర్ అస్రార్ భాష.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 26:**నంద్యాల టూ టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీ అస్రార్ భాష నంద్యాల ఈగల్ టీంతో పాటు నంద్యాల పట్టణంలోని న్యూక్లియస్ జూనియర్ కళాశాల యొక్క బాయ్స్ హాస్టల్ నందు దేశాన్ని ప్రేమించే ఏ వ్యక్తి కూడా డ్రగ్స్ ముట్టుకోరు. అనే నినాదంతో డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమం ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు గంజాయి మరియు మాదకద్రవ్యాల వినియోగం వలన వచ్చే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడం జరిగింది. మాదకద్రవ్యాలు రవాణా చేసిన వినియోగించిన విక్రయించిన చట్ట ప్రకారం నేరంగా పరిగణించడం జరుగుతుంది. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మీ బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలని పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. మత్తుపదార్థాలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు కానీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు కాల్ చేసి తెలియజేయాలని, తెలియజేసిన వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలియజేయడం జరిగింది.

# పట్టణంలో ట్రేడ్ లైసెన్స్ దారులు నష్టపోతున్నారు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 26:** పట్టణంలో లైసెన్స్ లేని, లైసెన్స్ రెన్యువల్ చేయని వ్యాపారులపై అధికారులు భారీ జరిమానాలు విధించడం వల్ల రెడీమేడ్ వస్త్ర వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నంద్యాల రెడీమేడ్ అసోసియేషన్ అధ్యక్షులు గద్వాల నరసింహరాజు తెలిపారు. గురు వారం నరసింహారాజు మాట్లాడుతూ గత ఆరేళ్లుగా వ్యాపారుల నుంచి ట్రేడ్ లైసెన్స్ ఫీజు సరిగా వసూలు చేయలేదని విమర్శించారు. ఇప్పుడు రిజిస్ట్రేషన్ తేదీ నుంచి ఫీజులు వసూలు చేయడం సరైందికా దన్నారు. గత ఆరేళ్ల ఫీజులను పూర్తిగా రద్దు చేయడంతో పాటు ఫీజు తగ్గించి 2026 నుంచి మాత్రమే వసూలు చేయాలని కోరారు. ప్రభుత్వం వ్యాపారులతో స్నేహపూర్వకంగా ఉంటూ వివిధ ఎంఎస్ ఎంఈ పథకాలను అందిస్తోందన్నారు. గత ఆరేళ్ల ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించాలని అధికారులు వ్యాపారులను ఒత్తిడి చేయ డం తగదన్నారు.. ట్రేడ్ లైసెన్స్ పొందడం, ఆలస్య రుసుం, జరిమానాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. గత ఆరేళ్లుగా వ్యాపారాలు సరిగా లేక, కమర్షియల్ కాంప్లెక్స్ అద్దెలు ఎక్కువగా ఉండటం వల్ల వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రెడీమేడ్ వ్యాపారుల సమస్యలపై గౌరవ అధ్యక్షులు పబ్బతి వేణుగోపాల్ సహకారంతో మున్సిపల్ కమిషనర్ శేషన్నతో చర్చించామన్నారు ఈనెల 28వ తేదీ లోపల ఫీజులు, జరిమానాలు కట్టకుంటే మరింత జరిమానాలు విధిస్తామని వస్త్ర వ్యాపారులకు నోటీసులు ఇవ్వడం అన్యాయం అన్నారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజుల రుసుమును చెల్లించడానికి మరో నెల రోజులు సమయం పెంచాలని డిమాండ్ చేశారు.మంత్రి ఫరూక్ చొరవ తీసుకొని వ్యాపారస్తుల ట్రేడ్ లైసెన్స్ ల సమస్యను పరిష్కరించాలని కోరారు.

# టెక్కెలో వైభవంగా నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు.

## ముఖ్య అతిథులుగా పాల్గొన్న టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఫిబ్రవరి 26:** నంద్యాల పట్టణ సమీపంలోని టెక్కెలో వెలసిన శ్రీ నాగులకట్ట గౌరి సమేత స్పటిక లింగేశ్వర అభయాంజనేయ స్వామి దేవస్థానంలో నూతన నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో నంద్యాల తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మరియు నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరికి ఆలయ కమిటీ సభ్యులు మరియు అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు నూతనంగా ప్రతిష్ఠించిన నవగ్రహాలకు మరియు స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు మాట్లాడుతూ భక్తిభావం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని, లోక కల్యాణార్థం ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమని కొనియాడారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 13 వార్డ్ టీడీపీ ఇంచార్జి మధు సాయి , గోవింద్ నాయుడు, స్వామి నాయక్ మరియు ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు, అర్చక స్వాములు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మే 3న నీట్ పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలి.

## జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఫిబ్రవరి 26:** దేశవ్యాప్తంగా మే 3వ తేదీన నిర్వహించనున్న నీట్‌యూజి పరీక్షలను జిల్లాలో అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి నీట్ యూజి పరీక్షల డైరెక్టర్ జనరల్ ప్రదీప్ సింగ్ కరోలా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, డీఈఓ జనార్దన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలలో 1,320 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ హై స్కూల్, టెక్కె జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో జరుగుతుందన్నారు. అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటల తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్రాల్లోకి ప్రవేశం ఉండదని స్పష్టం చేశారు. అభ్యర్థులు తప్పనిసరిగా అడ్మిట్ కార్డు, ఆధార్/పాన్/ఓటర్ ఐడి/డ్రైవింగ్ లైసెన్స్ వంటి చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డు మరియు పోస్ట్‌కార్డ్ సైజు ఫోటో వెంట తెచ్చుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబడవని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని, తాగునీరు, తగిన వెలుతురు వంటి మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. దివ్యాంగ అభ్యర్థుల కోసం ప్రతి కేంద్రంలో రెండు వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అభ్యర్థులు అధిక ఒత్తిడిలో పరీక్ష రాస్తుండటంతో ఇన్విజిలేటర్లు సహానుభూతితో, సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా నీట్ యూజి పరీక్షల డైరెక్టర్ జనరల్ ప్రదీప్ సింగ్ కరోలా మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పరీక్షా నిర్వహణలో నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ దుకాణాలు మూసివేయాలని, అవసరమైతే ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలలను కూడా కేంద్రాలుగా వినియోగించుకోవాలని సూచించారు. కేటాయించిన సామర్థ్యానికి 10 శాతం అదనంగా సీట్లు ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# మహిళా ఉద్యోగిపై వేధింపుల ఆరోపణలు.

## ఏపీవోపై లైంగిక వేధింపుల ఫిర్యాదు..

### ఉన్నతాధికారుల జోక్యం కోరిన బాధితురాలు.




**ఆంధ్ర ప్రగతి గడివేముల, ఫిబ్రవరి 26:** నంద్యాల జిల్లా గడివేముల మండలంలోని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) కార్యాలయంలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగిపై అదే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏపీవో ... లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెలువడ్డాయి. ఈ మేరకు బాధితురాలు తన ఆవేదన వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారుల దృష్టికి విషయం తీసుకెళ్లినట్లు సమాచారం. బాధితురాలి వాదన ప్రకారం, గత కొంతకాలంగా తనపై అనుచిత ప్రవర్తన కొనసాగుతోందని, పలు మార్గాల్లో ఒత్తిళ్లు తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపింది. తన కోరికలకు లోబడితే ఉన్నతాధికారుల వద్ద సహాయం చేస్తానని సంకేతాలు ఇస్తూ మానసికంగా వేధిస్తున్నారని ఆరోపించింది. ఈ పరిస్థితుల వల్ల కార్యాలయానికి రావడానికే భయపడే స్థితి ఏర్పడిందని పేర్కొంది. అంతేకాక, గతంలో కూడా కొంతమంది మహిళా ఉద్యోగులు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారని సహోద్యోగుల మధ్య చర్చ జరుగుతోందని సమాచారం. అయితే ఈ విషయమై అధికారికంగా ఎవరూ ముందుకు రాలేదని తెలుస్తోంది.ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలని బాధితురాలు ఉన్నతాధికారులను కోరింది. ఆరోపణలపై సంబంధిత అధికారుల స్పందన తెలియాల్సి ఉంది. విచారణ అనంతరం వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. మహిళా ఉద్యోగుల భద్రత, గౌరవ పరిరక్షణకు కట్టుబడి చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

# స్నేహ బంధం బలోపేతమే

## మంత్రి నారా లోకేష్ విందు.

### ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.





**ఆంధ్ర ప్రగతి అమరావతి ఫిబ్రవరి 26:** ఉరుకు పరుగుల రాజకీయ జీవితంలో కొంత ప్రశాంతత, కుటుంబాల ఆత్మీయ కలయిక, పలకరింపు, స్నేహబంధం బలోపేతమే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆత్మీయ విందు అని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి గురువారం అన్నారు. నంద్యాల జిల్లా ఉమ్మడి ప్రభుత్వ ప్రజా ప్రతినిధుల కుటుంబ సభ్యులకు అమరావతిలో బుధవారం రాత్రి మంత్రి నారా లోకేష్ ఆత్మీయ విందు ఇచ్చారు. ఈ ఆత్మీయ విందులో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, ఆమె భర్త డాక్టర్ శివ చరణ్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ విందులో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా, కుటుంబాల మధ్య స్నేహబంధాన్ని బలపరిచేలా, స్నేహంసహకారం సాన్నిహిత్యానికి ప్రతీకగా నిలిచిన ఈ విందు సమావేశం మాకు మరింత ప్రోత్సాహం ఇచ్చిందని, నాయకత్వం అంటే కేవలం సభలు, సమావేశాలు మాత్రమే కాదు, మనుషుల మధ్య బంధం, అనుబంధాలను పెంచే మనసు కూడా అని, అలాంటి ఆత్మీయతను చూపించిన మంత్రి నారా లోకేష్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాం అని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

# సంఘ్ కార్యాలయం ప్రేరణ కేంద్రంగా, సమాచారం నిలయంగా,
# సంపర్క సూత్రంగా వెలు గొందాలి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 26:**
నంద్యాల జిల్లా, ఆరు దశాబ్దాల పైగా స్వయం సేవకుల ఆకాంక్షల సాకారంగా నూతన జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవం హర్షోల్లాసాల మధ్య శాస్త్రోక్తంగా జరిగింది.
ముందు రోజు శాంతి హోమం నేడు గృహప్రవేశం, సత్యనారాయణ వ్రతం తో శాస్త్ర బద్ధంగా జరిగింది.
తదుపరి విభాగ్ సంఘ్ చాలక్ శ్రీ నీలకంఠేశ్వరయ్య అధ్యక్షతన సమావేశమైన సభలో విద్యా భారతి క్షేత్ర కార్యకారిణి సదస్యులు డాక్టర్ గడ్డం రామకృష్ణారెడ్డి, ప్రముఖ నిర్మాణ సంస్థ పీ వీ గ్రూప్ వ్యవస్థాపకులు, ప్రస్తుత మన కార్యాలయ నిర్మాత శ్రీ పబ్బతి వేణు గోపాల్, ప్రధాన వక్త ప్రాంత ప్రచారక్ శ్రీ విజయ ఆదిత్య జీ, జిల్లా సంఘ్ చాలక్ శ్రీ చిలుకూరి శ్రీనివాస్ వేదిక నలంకరించారు. భవన నిర్మాణంలో విశేషంగా కృషి చేసిన వారిని లాంఛనంగా సత్కరించిన తదుపరి వక్త సందేశంలో మాధవ నిలయం, వివేకానంద సేవా సమితి సంయుక్త కార్యాలయాలు ఎంతో బాధ్యతాయుతంగా తమ సమాజ సేవా కార్యక్రమాలలో పునరంకిత మవ్వాలని పిలుపు నిచ్చారు.
కార్యాలయం సమాజానికి ప్రేరణ దాయకంగా, కార్యాలయ సందర్శకులకు స్ఫూర్తినివ్వాలని తెలిపారు.
జిల్లాలోని అన్ని గ్రామాల్లోని సంఘ్ శాఖల, స్వయం సేవకుల పూర్తి సమాచారం కలిగిన సమాచారం కేంద్రంగా, నూతన సాంకేతికతను అంది పుచ్చుకుని, సదరు సమాచారాన్ని శాస్త్రీయంగా విశ్లేషించి, సమయాను కూలంగా వినియోగించుకుని సంఘకార్య సార్వ జనీనతకు కృషిచేయాలి.




### కార్యాలయం " సంపర్క సూత్రం"

కార్యాలయం సందర్శించిన వారికి స్ఫూర్తి నివ్వడమే కాకుండా, వారి సమాచారాన్ని ప్రచారకులకు, ప్రచారకుల సమాచారాన్ని అందుబాటును వారికి అందించి సంపర్క సూత్రంగా వెలుగొందాలి.
మనం సమాజంలో ఏ ఆదర్శ మార్పులనైతే ఆశిస్తున్నామో, ఆ ఆదర్శాలన్నీ ఉత్కృష్ట స్థాయిలో మన కార్యాలయంలో ఆచరింప బడాలి. మనకు సమాజం ఇలాంటి ఆస్తులు ఎన్ని కల్పించినా సంఘ్ యొక్క ఏకైక ఆస్తి సంఘ్ శాఖ మాత్రమే, అందులో సాన పెట్టబడిన స్వయం సేవకులు మాత్రమే. సంఘ్ వ్యక్తి నిర్మాణం తప్ప మరే పని చేయదు. సంఘ్ శాఖలో తయారైన స్వయం సేవకులు మాత్రమే సమాజోద్ధరణ పనులు స్వచ్ఛందంగా చేపడతారు.
సదరు కార్యక్రమంలో జిల్లా వ్యాప్త జ్యేష్ఠ స్వయం సేవకులు, సంఘ్ శ్రేయోభిలాషులు, స్వయం సేవకులు, తదితర పెద్దలు విస్తృతంగా పాల్గొని కార్యక్రమాన్ని ఆద్యంతం ఆస్వాదించారు.








# బంగారు కుటుంబాలకు మార్గదర్శుల
# మ్యాపింగ్‌ను వేగవంతం చేయాలి.

**అవసరమైన సౌకర్యాలను గుర్తించి సమగ్ర సహాయం అందించాలి.**

**వ్యవసాయ రంగ కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌లో జిల్లా ముందంజలోకి తీసుకురావాలి.**

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఫిబ్రవరి 26:**
రాష్ట్రంలో పేదరిక నిర్మూలనను లక్ష్యంగా పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పి4 (ప్రభుత్వప్రైవేటుప్రజల భాగస్వామ్యం) కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి పేర్కొన్నారు. గురువారం విజయవాడ నుండి స్వర్ణాంధ్ర, జీరో పావర్టీ పి4 ప్రోగ్రామ్, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ తదితర అంశాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక & ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ పీయూష్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, సీపీఓ ఓబులేసు, నోడల్ అధికారులు, నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి గారి సూచనల మేరకు స్వర్ణాంధ్ర జీరో పావర్టీ పి4 కార్యక్రమంలో జిల్లాను ముందంజలో నిలిపేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌పై ప్రతి నెలా సమీక్షలు నిర్వహిస్తూ లక్ష్యసాధనకు కట్టుబడి ఉన్నామని ప్రిన్సిపల్ సెక్రటరీకి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, జిల్లాలో ఇప్పటివరకు 44,079 బంగారు కుటుంబాలను గుర్తించామని తెలిపారు. ఈ కుటుంబాలకు మార్గదర్శులను నియమించి, వారిని త్వరితగతిన మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. బంగారు కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని మార్గదర్శుల ద్వారా సమర్థవంతంగా అందించాలన్నారు. ఉత్తమ సేవలు అందించిన మార్గదర్శుల వివరాలను మార్చి మొదటి వారంలోపు సమర్పించాలని నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్ సిబ్బందిని ఆదేశించారు. బంగారు కుటుంబాలకు వైద్యసంబంధిత అత్యవసర అవసరాలుంటే, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా రూ. 25 లక్షల వరకు, అలాగే ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్యసదుపాయం లభిస్తుందని తెలిపారు. ఈ పథకాల గురించి అర్హులైన కుటుంబాలకు సమగ్ర అవగాహన కల్పించాలని సూచించారు. చికిత్స కోసం ఆలస్యం కాకుండా ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకునే విధానం, ఫోన్ ద్వారా నమోదు సౌకర్యం కూడా అందుబాటులో ఉన్నట్లు వారికి తెలియజేయాలన్నారు. ఈ ప్రక్రియలో నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్ నోడల్ అధికారులు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. జిల్లాను వ్యవసాయ రంగంలోని కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌లో మరియు స్థూల దేశీయోత్పత్తి పెంపులో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. జిల్లాలోని సుమారు 70 వేల ఎకరాల బీడు భూములను సాగులోకి తీసుకురావడంలో వ్యవసాయ శాఖ కీలక పాత్ర పోషించిందని అభినందించారు. మహానంది మండలంలో తలసరి ఆదాయం అధికంగా ఉన్నప్పటికీ, పగిడ్యాల, గోస్పాడు, నందికొట్కూరు మండలాల్లో తలసరి ఆదాయం తక్కువగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ మండలాల్లో ఆదాయం పెంపుదలకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్ సిబ్బందిని ఆదేశించారు. పేదరిక నిర్మూలన, ఆర్థికాభివృద్ధి, వ్యవసాయ పురోగతి...ఈ మూడు అంశాలను సమన్వయంతో అమలు చేస్తూ జిల్లాను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.






## ఆత్మహత్య ప్రయత్నం చేసిన మహిళను కాపాడిన ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మరియు వారి సిబ్బంది.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 26:**
నంద్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ చాంద్ భాషా తమ సిబ్బందితో కలిసి నేటి మధ్యాహ్నం విధినిర్వహణ నిమిత్తం నగర్ వెళ్లే బ్రిడ్జిపై వెళ్తుండగా ఒక మహిళ బ్రిడ్జి పై నుండి కుందూ నదిలోకి దూకేందుకు ప్రయత్నిస్తుండగా అప్రమత్తమైన ఇన్స్పెక్టర్ తమ సిబ్బంది నాగాయ్య, పోలీస్ ఆలాం, నాగ శేషు లు పోలీస్ వాహనం నుంచి త్వరగా దిగి ఆ మహిళను కాపాడడం జరిగింది. బ్రిడ్జి పైన నుంచి అటుగా వెళ్లుచున్న పెద్ద మనుష్యులను ఆపి సదరు మహిళను వారి సమక్షంలో విచారించగ సదరు మహిళ తన పేరు వివరాలు తెలియజేస్తూ ఉదయం నాతో నా భర్త మరియు నా అత్త గొడవపడి నన్ను చాలా బాధ పెట్టినారని అందుకు నేను ఆత్మహత్య చేసుకునేందుకు కుందు నదిలోకి దునకుతుండగా మీరు వచ్చి పట్టుకున్నారు.నేను చచ్చిపోవాలని నిర్ణయించుకొని నాకు వున్నా ఒక కుమారుణ్ణి స్కూల్ వద్ద వదిలి వచ్చినాని ఏడుస్తూ చెప్పుచుండగా మేము మరియు పెద్ద మనుష్యుల సహాకారం తో ఆమెను ఓదార్చి అక్కడి నుంచి పోలీస్ వాహనం నందు ఆమెను ఆమె యింటి వద్దకు తీసుకొని పోయి ఆమె యొక్క మామ, అక్క మరియు అన్నల సమక్షంలో అప్పగించడం జరిగింది.



# ఆరోగ్య సేవలపై ప్రజా అభిప్రాయం మెరుగుపడాలి.

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఫిబ్రవరి 26:**
జిల్లాలో వైద్య శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలపై సానుకూల అభిప్రాయం పెరగాలంటే సేవల నాణ్యతను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వైద్యాధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి మెడికల్ ఆఫీసర్లు, సీహెచ్‌సీ వైద్యులు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ తదితరులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి సమయానికి, నాణ్యమైన వైద్య సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా పెద్దఎమ్మనూరు, రుద్రవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద వైద్య సేవలపై ప్రజల్లో ప్రతికూల అభిప్రాయం ఉన్నట్లు గుర్తించినందున, అక్కడి వైద్యులు సేవా దృక్పథంతో వ్యవహరించి రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. అలాగే ఆళ్లగడ్డ సీహెచ్‌సీపై ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో, సేవల్లో లోపాలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కూడా రోగులకు సకాలంలో చికిత్స, అవసరమైన సౌకర్యాలు అందేలా సూపరింటెండెంట్ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల ఖాళీ పోస్టులు లేకుండా వెంటనే భర్తీ ప్రక్రియను చేపట్టాలని డిఎంహెచ్ఓను ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అవసరమైతే హెచ్‌డిఎస్ నిధులను వినియోగించి శానిటేషన్ మెరుగుపరచాలని తెలిపారు. వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, ప్రజలకు మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఉచితంగా మందులు అందించడంతో పాటు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు పూర్తి స్థాయి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ డా. వెంకటరమణ, అదనపు డిఎంహెచ్ఓ డా. శారద, డిసిహెచ్ఎస్ డా. ఓ. లలిత తదితరులు పాల్గొన్నారు.




## రాయలసీమ లిఫ్ట్ ఇర్రిగేషన్‌కు మోసం చేసిన కూటమి ప్రభుత్వం.

**ఎమ్మెల్సీ ఇసాక్ బాషా.**



**ఆంధ్ర ప్రగతి అమరావతి ఫిబ్రవరి 26:**
రాయలసీమ లిఫ్ట్ ఇర్రిగేషన్ ప్రాజెక్ట్ విషయంలో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా విమర్శించారు. శాసన మండలిలో తాను సూటిగా అడిగిన ప్రశ్నకు కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పకుండా తప్పించుకుందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో రాయలసీమ లిఫ్ట్ ఇర్రిగేషన్ అంశంపై ఎందుకు ఒప్పందం చేసుకున్నారో స్పష్టంగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రజలకు పూర్తి వివరణ ఇవ్వాలని కోరారు.
రాయలసీమ లిఫ్ట్ ఇర్రిగేషన్ ప్రాజెక్ట్ ఎప్పటి వరకు పూర్తి అవుతుందో ఖచ్చితమైన గడువు ప్రకటించాలని ఆయన ప్రభుత్వంను ప్రశ్నించారు. ప్రాజెక్ట్ పూర్తి అయ్యే వరకు తాము నిరంతర పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

## ఎమ్మెల్సీ కొణిదల నాగబాబుని కలిసిన బనగానపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు.

**ఆంధ్ర ప్రగతి మంగళగిరి ఫిబ్రవరి 26:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి సభ్యులు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు ని విజయవాడలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో బుధవారం బనగానపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు భాస్కర్ మరియు గుర్రప్ప కొలిమిగుండ్ల మండలం నాయకులు పృథ్వి అవుకు మండల నాయకులు అజిత్ రెడ్డి, జనార్ధన్ యాదవ్, సంజామల మండల నాయకులు రాజు, భాను, బనగానపల్లె నాయకులు హాజీవలి, రాఘవేంద్ర తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గం పరిస్థితుల పై చర్చించి నంద్యాల జిల్లా పర్యటన చేయవలసిందిగా కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నాగబాబు మాట్లాడుతూ కష్టపడి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని అందరికీ అవకాశాలు వస్తాయని పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుని వెళ్లాలని గ్రామస్థాయిలో పర్యటించి స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సమస్య పరిష్కారాల కృషిలో ఇబ్బందులు ఎదురైనప్పుడు స్థానికంగా ఉన్న శాసనసభ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలను కూటమి పార్టీల నేతలతో కలిసి సమిష్టిగా తిప్పికొట్టి ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాల గురించి విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు.



# మమతా బెనర్జీ కళ్లు తెరవాలి ! :సుప్రీం

**ఫిబ్రవరి 26ఆంధ్ర ప్రగతి**

బెంగాల్లో సర్ ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో అక్కడ జ్యుడిషియల్ అధికారుల అజమాయిషీలో జరగాలని ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతోపాటే సర్ ప్రక్రియను అడ్డుకోరాదని మమతా బనర్జీకి సుప్రీం గట్టిగానే సూచించింది. నిజానికి సర్ ప్రక్రియ ద్వారా ఓట్లను సంస్కరించడం అవసరమే. తమిళనాట లక్షల్లో ఓట్లు తొలగించారు. గుజరాత్‌లోనూ తొలగించారు. ఇప్పుడు దక్షిణాదిలో కూడా సర్ ప్రక్రియ కొనసాగనుంది. ఈ క్రమంలో ఓట్లు తొలగింపు వల్ల ఎవరైనా తమ ఓటు నిజంగానే కోల్పోతే వారి పక్షాన ప్రభుత్వం పోరాడాలి. అంతే తప్ప అడ్డుకోవడం సరికాదు. ఇదేదో రాజ్యాంగ విఘాతం కలిగించారన్న రీతిలో ప్రచారం చేయడం విపక్షాలకు తగదు. ఎన్నికల కమిషన్ ఏం చేసినా, ఎలా చేసినా విమర్శించే విపక్ష స్థానంలో ఉన్న కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డిఎంకెపార్టీలు తీవ్రంగా అడ్డుపడు తున్నాయి. బ్యాలెట్ బాక్స్ లతో ఓటింగ్ విధానం ఎలక్ట్రానిక్ ఓటింగ్ పద్ధతికి మారాక కొన్ని ఎన్ని కల వరకూ బాగా నడిచిందని ప్రశంసలు ఇచ్చిన పార్టీలు ఇప్పుడు ఆ విధానం వల్ల తమకు నష్టం వాటిల్లుతోందని ఘోషిస్తున్నాయి. పార్టీ ఏదైనా తమకు ఓటింగ్ అనుకూలంగా రాకపోయి ఓటమిపాలైతే ఎలక్ట్రానిక్ ఓటింగ్ పక్రి యలో లోటుపాట్లు ఉన్నందునే తాము ఓడిపోయామని విమర్శలు గుప్పిస్తున్నారు. విపక్ష పార్టీలు తమ స్థానాలు మారినా విమర్శలకు వెనుకాడడం లేదు. 'సర్' పేరెత్తితేనే విపక్షాల్లో అదీ అతి ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ అపచారం జరిగిందని అంటున్నారు. ఇలా కాకుండా ఎక్కడైనా ఓట్ల తొలగింపుతో ఎవరైనా నష్టపోతే దానిని ఆధారంగా చేసుకుని పోరాడాలి. కానీ మొత్తం ప్రక్రియనే వ్యతిరేకించడం ద్వారా రాజ్యాంగాన్ని తృణీకరిస్తున్నాయని గుర్తించాలి. సుప్రీం ఇచ్చిన ఆదేశాలు లేదా సూచనలు ఆయా రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలి. ఇంకా సర్ ప్రక్రియను అప్రతిష్టపాలు చేయాలనే ఆలోచన నుంచి రాజకీయ పార్టీలు బయటపడాలి. ఎన్నికల కమిషన్ పై సవాల్ చేసిన కాంగ్రెస్ పార్టీ ఓట్ చోరీపై తమ నిరసన ధ్వనులను పెంచుతున్నాయి. ఒకపక్క ఎన్నికల కమిషన్ త్వరలో ఎన్నికలు జరిగే పశ్చిమబెంగాల్, తమిళ నాడు, కేరళ వంటి రాష్ట్రాలలో ఓటర్ల జాబితా విస్తృత సవరణ (సర్) కార్యక్రమాన్ని చేపట్టగా కాంగ్రెస్ అధ్యక్షు డు రాహుల్గాంధీ, 'ఓట్ చోరీ' ప్రచార కార్యక్రమాన్ని బహుళ ప్రచారం చేస్తున్నారు. బీహార్ ఎన్నికల్లో చతికిలపడినా ఓటరు జాబితా విషయంలో రాజీ పడేది లేదనే ధోరణిలో ముందుకు కదులుతున్నారు. బీహార్లో 'సర్' కార్యక్రమం చేపట్టినప్పుడు ఎన్నికల కమిషన్ను కాంగ్రెస్ పార్టీ విపరీ తంగా ఆరోపణలు గుప్పించింది. ఎన్నికల కమిషన్ తన ధోరణిలో తనప్రణాళిక ప్రకారం ఓటరు జాబితా సవరణ కార్యక్రమం చేపట్టింది. ఎన్నికలు సజావుగానే నడిపించింది. బీహార్లో అప్పటికే అధికారంలో ఉన్న పార్టీకే ప్రజలు పట్టం కట్టారు. అంటే విపక్షాల అభ్యంతరాలు ఎవరినీ కదిలించలేదన్నది సుస్పష్టం. అయినా కాంగ్రెస్ తదితర పక్షాలు తాము పట్టిన




కుందేటికి మూడే కాళ్లన్న ధోరణిలో తమ పిడివాదంతో విమర్శలు గుప్పిస్తున్నాయి. ఓటు దొంగల కబంధ హస్తాల నుంచి భారత ప్రజాస్వామ్యాన్ని రక్షించే నినాదంతో కాంగ్రెస్ సంతకాల సేకరణ చేస్తోంది. బీహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ పార్టీ తన ఆలోచనలో మార్పు తెచ్చుకోగలదని అందరూ భావించారు. కానీ అలా జరుగలేదు. కనీసం ఆది నుంచీ ఒకే మాటమీద వ్యవహా రాన్ని నడిపిస్తున్నారు. బోగస్ ఓట్లను చేర్చడం, విపక్ష అనుకూల ఓటర్లను తొలగించడం, ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడడం వంటివి ఎన్నికల కమిషన్ భారతీయ జనతా పార్టీలు కలిసికట్టుగా వ్యవహరిస్తున్నాయన్నది కాంగ్రెస్ ఆరోపణలు. బిజెపి ఓటర్లకు ఆయా నియోజక వర్గాల్లో నగదు పంచుతున్నా చర్యలు తీసుకోకుండా, ఇసి సహకరిస్తోందని విపక్షాలు గట్టిగా నమ్ముతున్నాయి. తాజాగా పశ్చిమ బెంగాల్లో ఓటర్ల జాబితా సవరణ మొదలైంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఎన్నికల కమిషన్పై రుసరుసలాడుతున్నారు. దేశవ్యాప్తంగా ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఒక ఉద్దేశపూర్వక కుట్రగా అభివర్ణించారు. బీహార్ లో 'సర్' అమలులో విజయవంతమైన కార్యక్రమంగా రూపొందించి దేశవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాన్ని చేప ట్టేందుకు ఇసి నిర్ణయం తీసుకుందంటే అది ఎంతోమంచి కార్యక్రమమేననుకోవాలి. అయినా బిజెపియేతర ఇండియా కూటమిలు ప్రధానపక్షమైన కాంగ్రెస్ఎన్నికల కమిషన్ వివవరణలను ఆకళింపు చేసుకోలేకపోయింది. దానికితోడు దేశవ్యాప్త 'సర్' విచారణ కోసం నియమితులైన 16మంది బిఎల్ఎలు ఒత్తిడి వల్లనే మరణించారన్న వార్తలను ఆసరాగా చేసుకుని ఇసి ఒత్తిడిలపై కాంగ్రెస్ ధ్వజమెత్తింది. పశ్చిమ బంగలోని ధులగోరి, బిరాటి, న్యూటేన్ ఘుసురి వంటి ప్రాంతాల్లో ఎక్కువగా ఉండే బంగ్లా దేశీయులు ఓటర్ల జాబితా ఏరివేతలో తగు పత్రాలు చూపలేక అక్రమంగా వలస వచ్చినట్లు తేలినవారంతా ఇప్పుడు బంగ్లాదేశ్ దారిపట్టారు. ఇప్పుడీ కార్యక్రమం వలన పశ్చిమ బెంగాల్లో సంక్లిష్ట పరిస్థితులేర్పడ్డా యి. బంగ్లాదేశ్ నుంచి వచ్చి బెంగాల్లో ఉండేవారి పత్రా లను చూసే పనిని బిఎస్ఎఫ్ జవాన్లకు అప్పగించారు. వెనక్కివెళ్లే సమయంలోనూ వీరే వారిపత్రాలను పరిశీ లించి పోలీసులకు పంపాల్సి ఉంటుంది. ఈ పక్రియ ఎంతో కష్టమైనది. సుదీర్ఘమైనది. బంగ్లాదేశీయుల రివర్స్ మైగ్రే షన్తో బెంగాల్ పోలీసులు సతమత మవుతున్నారు. సరైన పత్రాలు లేనివారిని నిర్బంధించి జైల్లోపెట్టే పరిస్థితి ఉంది. నిజానికి బంగ్లాదేశీయులు పశ్చిమ బెంగాల్లో ప్రవేశించిన ప్పుడు దళారీల ద్వారా ఆధార్ కార్డులు రేషన్ కార్డులు, ఓటరు ఐడీలతో ప్రవేశించారు. ఇప్పుడు అలాంటి ఎన్నీ బయటపడి పత్రాలన్నీ నకిలీవని తేలుతున్నందున మమతా బెనర్జీ సిగ్గుపడాలి.

## ప్రధాని నరేంద్రమోడీ అరుదైన రికార్డు

### ఇన్‌స్టాలో వంద మిలియన్లు దాటిన ఫాలోవర్లు

**న్యూఢిల్లీఫిబ్రవరి 26ఆంధ్ర ప్రగతి**




భారత ప్రధాని నరేంద్ర మోదీ మరో అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. ప్రపంచంలో 100 మిలియన్ ఇన్‌స్టా ఫాలోవర్లు కలిగిన తొలి రాజకీయ నేతగా సరికొత్త రికార్డును నెలకొల్పారు. 2014లో ప్రధాని మోదీ తొలిసారిగా ఇన్‌స్టాగ్రామ్‌లో చేరారు. యువతరానికి కనెక్ట్ కావడంతో ఆయన ఫాలోవర్ల సంఖ్య నాటి నుంచీ పెరుగుతూనే ఉంది. ఫాలోవర్ల సంఖ్యాపరంగా ప్రధాని మోదీ తరువాతి స్థానంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిలిచారు. ఆయనను ఇన్‌స్టాలో ఫాలో అయ్యే వారి సంఖ్య 43.2 మిలియన్‌లు. ఆ తరువాతి స్థానాల్లో ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబొవో సుబియాంతో (15 మిలియన్ ఫాలోవర్లు), బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డి సిల్వా (14.4 మిలియన్ ఫాలోవర్లు), తుర్కియే అధ్యక్షుడు ఎర్దొగాన్ (11.6 మిలియన్ ఫాలోవర్లు), అ÷-జ్గ÷ంటీనా ప్రెసిడెంట్ జేవియర్ (6.4 మిలియన్ ఫాలోవర్లు) ఉన్నారు. ట్రంప్‌తో పాటు ఆ తరువాత నాలుగు స్థానాల్లో ఉన్న నేతల ఫాలోవర్ల సంఖ్యను కూలిపి చూసినా ప్రధాని మోదీ కంటే తక్కువగానే ఉండటం గమనార్హం. ఇక భారతీయ నేతల్లో కూడా ఫాలోవర్ల సంఖ్యాపరంగా ప్రధాని నెం.1గానే ఉన్నారు. ప్రధాని తరువాతి స్థానంలో ఉన్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు 16.1 మిలియన్ ఇన్‌స్టా ఫాలోవర్లు ఉండగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఉన్న ఫాలోవర్ల సంఖ్య 12.6 మిలియన్లు. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉండే ప్రధాని ఇన్‌స్టా వేదికగా వివిధ అధికారిక కార్యక్రమాలు, అంతర్జాతీయ పర్యటనలు, రాజకీయ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు వివరాలను పంచుకుంటూ ఉంటారు. తన మనసులోని భావాలను కూడా ఫాలోవర్లతో షేర్ చేసుకుంటుంటారు.

## ప్రైవేట్ విద్యుత్ బస్సులకు ఆర్టీసీ డిపోలు

### ఆర్టీసికి ప్రయోజకరం కాదన్న లెఫ్ట్

### పునరాలోచన చేయాలని సిపిఎం లేఖ

**అమరావతి,ఫిబ్రవరి 26ఆంధ్ర ప్రగతి**




ప్రయివేటు విద్యుత్ బస్సులకు ఆర్‌టిసి డిపోలను అప్పగించడాన్ని ఆపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. పిఎంఇ పేరుతో ప్రయివేటు విద్యుత్ బస్సులను పూణెకు చెందిన పినాకల్ కంపెనీ నిర్వహిస్తున్నట్లు, దానికోసం 11 డిపోలకు చెందిన 12 స్థలాలను వారికి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పత్రికల్లో వార్తలు రావడం ఆందోళనకరమని తెలిపారు. పిఎం ఇ-బస్సు సేవ పథకంలో గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు పద్ధతిలో ప్రయివేటు సంస్థల ద్వారా బస్సులు నిర్వహించే పద్ధతి అటు ఆర్‌టిసికి, ఇటు ప్రజలకు ప్రయోజనం కాదని పేర్కొన్నారు. విజయవాడలోని విద్యాధరపురం, గుంటూరు-2, నెల్లూరు-2, తిరుపతిలో మంగళం డిపోలను పూర్తిగా, మరో ఎనిమిది డిపోలను పాక్షికంగా ప్రయివేటు వారికి ఇవ్వాలని ఆర్‌టిసి ఉత్తర్వులివ్వడం, మనుగడకు, ప్రజల ప్రయోజనాలకు నష్టకరమని పేర్కొన్నారు. మరికొన్ని సిఎన్‌జి బస్సులనూ నడపనున్నట్లు వార్తలొస్తున్నాయని, ఈ కొత్త విధానంపై కార్మిక సంఘాలతో, నిపుణులతో చర్చించడంతో పాటు, ఇతర రాష్ట్రాల్లో( అమలుతీరుపై సమగ్రంగా అధ్యయనం చేసిన తర్వాతనే తుది నిర్ణయం తీసుకోవాలని కోరారు. విద్యుత్ బస్సులను నడపాల్సి వస్తే దశలవారీ ఆర్‌టిసి సంస్థ ద్వారానే నడపాలని, అందుకు అనుగుణంగా ప్రభుత్వ నిర్ణయం వుండాలని తెలిపారు. విద్యుత్ బస్సుల పేరుతో ప్రయివేటు కన్సార్టియంలకు రూ.కోట్లు విలువ చేసే డిపోలు, స్థలాలను ఇచ్చేసే ప్రతిపాదనలు అంతిమంగా ఆర్‌టిసికి, ప్రజల ప్రయోజనాలకు నష్టం కలుగజేస్తాయని వివరించారు. స్త్రీ శక్తి పథకం అమలు వల్ల ప్రయాణికుల రద్దీ పెరిగిందని, సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగిందని తెలిపారు. డిమాండ్‌కు అనుగుణంగా 4 వేల బస్సులు, 11 వేల మంది ఉద్యోగుల అవసరం వుందని కార్మిక సంఘాలు చెబుతున్నాయని, డిపోలను విస్తరించి రవాణా సౌకర్యాలను మరింత పెంచాల్సి వుందని పేర్కొన్నారు. డిపోల ప్రయివేటీకరణను ఉపసంహరించుకుని, రద్దీకి అనుగుణంగా బస్సులను, సిబ్బందిని నియమించాలని శ్రీనివాసరావు కోరారు.

## పెన్షన్ల హామీ గుదిబండ కానుందా?

**పెంచితే ఖజానాపై బారీగా భారం**

**పెంచకుంటే విపక్షాల నుంచి విమర్శలు**

**మల్లగుల్లాలు పడుతున్న అధికార పక్షం**

**హైదరాబాద్,ఫిబ్రవరి 26ఆంధ్ర ప్రగతి**

ఆరు గ్యారెంటీలు, పెన్షన్ల పెంపు, తులం బంగారంపై విపక్ష బిఆర్ఎస్ ఎక్కడిక్కడ నిలదీస్తోంది. దీనికితోడు వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో సర్కార్‌ను నిలదీసేందుకు సన్నద్ధం అవుతోంది. బడ్జెట్ లెక్కలు వేసుకుంటున్న ప్రభుత్వం ఈ మొత్తాలకు మరింత వెచ్చించాలంటే జంకుతోంది. ఇప్పటికే వేలకోట్లు అప్పులకు గాను వడ్డీలు చెల్లిస్తోంది. 2024 సామాజిక సర్వే లెక్కల ప్రకారం ప్రస్తుతం 42.7 లక్షల మందికి పింఛను అందుతోంది. ఇందుకోసం ప్రతి నెలా రూ.950 కోట్ల వరకు ఖర్చవుతోంది. ఈ పింఛన్‌ను ప్రస్తుతానికి రూ.500 చొప్పున పెంచితే.. నెలకు సుమారు రూ.210 కోట్లు అదనంగా అవసరమవుతాయి. అంటే ఏడాదికి రూ.2500 కోట్లకు పైగా భారం ప్రభుత్వంపై పడనుంది. దీనిపై తుది నిర్ణయానికి వచ్చాక బ్జడెట్‌లో కూడా ప్రస్తావించే అవకాశాలున్నాయి. తొలి విడతలో పెంచాలని భావిస్తున్న మొత్తాన్ని కూడా కలిపి బ్జడెట్‌లో కేటాయింపులు చేయన్నుట్లు తెలుస్తోంది. కాగా, దివ్యాంగుల పింఛను పొందేవారు తక్కువ



సంఖ్యలోనే ఉన్నారని, వీటి వరకు కొంత ఎక్కువ మొత్తం పెంచాలన్న విజ్ఞప్తులు కూడా ఉన్నాయి. అయితే అందరికీ ఒకే విధంగా, సమ స్థాయిలోనే పెంచాలని ప్రభుత్వం ప్రాథమికంగా ఒక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. చేయూత ఫించన్లను ఇలా విడతల వారీగా పెంచుతూ ఎన్నికల నాటికి రూ.4 వేలకు తీసుకెళ్లాలన్న యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారుల స్థాయిలో మాత్రం చర్చలు మొదలుకాలేదు. ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకున్నాకే తమకు సమాచారం చేరుతుందని ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేయూత పథకం కింద ఇస్తున్న పింఛన్‌ను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా.. పింఛను మొత్తాన్ని విడతల వారీగా పెంచాలన్న అభిప్రాయంతో ఉంది. ప్రస్తుతం చేయూత పథకం ద్వారా వృద్ధులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ రోగులు, డయాలసిస్ రోగులు, చేనేత, గీత కార్మికులు, బీడీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2016 చొప్పున, దివ్యాంగులకు రూ.4016 చొప్పున పింఛను ఇస్తోంది. కానీ, ఎన్నికల సమయంలో చేయూత పింఛన్‌ను రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం వంటి హామీలను అమలులోకి తెచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు.. ఇప్పుడు పింఛన్ల పెంపుపై దృష్టి సారించింది. అయితే ఈ హామీని కొంతకాలం ఆగాక నెరవేర్చడమా? లేదంటే ఇప్పటి నుంచే విడతల వారీగా పింఛను పెంచుతూ వెళ్లడమా? అని ఉన్నత స్థాయిలో చర్చ జరిగినట్లు సమాచారం. విడతలవారీగా పెంచితే.. తొలి విడతలో రూ.500 పెంచాలన్న అభిప్రాయంతో ప్రభుత్వం ఉందని తెలుస్తోంది.

## పవిత్ర రోజాలో ఆరోగ్య రహస్యం

**గుంటూరు,ఫిబ్రవరి 26ఆంధ్ర ప్రగతి**

రంజాన్ మాసంలో ఉపవాసదీక్ష ప్రత్యేకతే వేరు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపావాస దీక్ష చేయడం ఆరోగ్య రక్షణ రహస్యం దాగివుంది. పవిత్ర గ్రంథమైన ఖురాన్ ప్రకారం ఉపవాస దీక్షలు పాటించడం ఆరోగ్యానికి మంచిదేనని గ్రంథాలు తెలుపుతున్నాయి. రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాసదీక్షలు చేపట్టడడంవల్ల ఎంతో పుణ్యం, మంచి ఆరోగ్యంగా ఉంటామని ఇస్లామిక్ గ్రంథాలు పేర్కొంటున్నాయి. సూర్యోదయానికి ముందు సూర్యాస్తమయం తర్వాత ఆహారం తీసుకోవడం ద్వారా జీర్ణకోశ సంబంధ వ్యాధులు దూరమవుతాయని ప్రకృతి వైద్యులు స్పష్టం చేస్తున్నారు.రోజావల్ల జీర్ణకోశ వ్యాధులు దూరం సహర్, ఇఫ్తార్ వేళలో ఆహారాన్ని తీసుకోవడంలో ఎన్నో శాస్త్రీయ కారణాలు కనిపిస్తున్నాయి. రుషులు, సూర్యోదయానికి ముందు సూర్యాస్తమయం తర్వాత ఆహారాన్ని తీసుకునేవారని, ఉద యం, సాయంత్రం వేళల్లో ఆహారాన్ని స్వీకరించడం ద్వారా ఎన్నో లాభాలున్నాయి. తీసుకున్న ఆహారం సంపూర్ణంగా జీర్ణమవుతుందని, జీర్ణశక్తి పెరుగుతుందని, దీంతో రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. రోజా సమయంలో ఎక్కువగా పండ్లు ఫలాలు తీసుకుంటారని వీటిలో ఫోరిక్ యాసిడ్, కాల్షియం ఉంటాయి. ఇవి ఎనిమియాను దూరం చేస్తాయి.సంవత్సరంలోని 12 నెలల్లో పవిత్రమైన రంజాన్ మాసానికి విశేష ప్రాముఖ్యత ఉంది. సూర్యోదయానికి ముందు ఆహారం తీసుకోవడంలోనే ఆరోగ్యం దాగి వుందని ఇస్లాం బోధిస్తుంది. మహ్మద్ ప్రవక్త కూడా ప్రాతఃకాలానికి ముందే ఆహారాన్ని స్వీకరించేవారని ఆయన అనుచరులు ఎన్నో హదీసులలో వివరించారు.



ఉపవాస వ్రతం రోజా ఈ మాసంలోనే విధిగా నిర్ణయించబంది. వేయి మాసాలకన్నా అత్యంత విలువైన రాత్రి లైలతుల్ ఖద్ర్ మానవాళి మార్గదర్శనం కోసం దైవం పంపిన పవిత్ర గ్రంథం ఖురాన్ కూడా ఈ మాసంలోనే అవతరించింది. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న రంజాన్ మాసం రోజాలు ఉండేవారికి అంత పుణ్యం ఉంటుందని ఇస్లామిక్ గ్రంథాలు తెలుపుతున్నాయి. రోజా వల్ల మానవులను మంచివారుగా సౌశీల్యవంతులుగా, దైవభీతి గలవారుగా తీర్చిదిద్ద డం, దీనివల్ల భక్తిని పెంచే అవకాశం ఉంది. స్త్రీ పురుషులందరూ రోజా వ్రతాన్ని తప్పనిసరిగా పాటించాలని దేవుడు ఆదేశించాడు. ఎవరైనా దీన్ని తిరస్కరిస్తే మతభ్రష్టులు, మార్గభ్రష్టులు అయ్యే అవకాశముంది. మానవుల బలహీనతలను, వారి కష్టసుఖాలను బాగా తెలిసిన దేవుడు ఉపవాసాలను విధిగా చేసినప్పటికీ కొందరికి కొన్ని మినహాయింపులు కూడా ప్రసాదించారు. చిన్నపిల్లలు, బాటసారులు, వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, గర్భవతులు, బాలింతలు, మతిస్థిమితంలేని వారు అపరిశుద్ధావస్తలో ఉన్న స్త్రీలు ఉపవాసవ్రతం నుంచి మినహాయింపు ఉంది.

ఉపవాసాలు ఉండటంవల్ల మనుషులు ఆరోగ్య వంతులుగా ఉంటారని బ్లడ్ ప్రెషర్, షుగర్ సాధారణ స్థితికి వస్తుందని వైద్యులు సూచిస్తున్నారు. జీర్ణ వ్యవస్థకు విశ్రాంతి కలుగుతుందని తెలిపారు. బరువు తగ్గడానికి ఉపయోగ పడుతుందనితెలిపారు.